# మనసులోని కోరిక

తులసి వెనకాలవున్న అన్ని గదులూ వూడ్చి, దక్షిణపు వైపున్న పడగ్గదిని ఊడవడానికి దగ్గరగావున్న ఆగదితలుపుల్ని మెల్లగా ముందుకుతోసి లోపలికిచూచింది.



గదిలో తన కెదురుగా నిలబడి ఎవరో ముందుకువంగి తనవంకే చూస్తున్నట్టనిపించింది. తులసికి భయంవేసింది. కాస్త నిదానించి చూచేసరికి ఎదురుగుండా గోడ కమర్చబడిన ఒక నిలువుటద్దం కన్పించింది. అందులోని తన ప్రతిబింబాన్ని చూచే తాను భయపడిందన్న విషయం గ్రహించి నవ్వుకుంటూ అద్దం ముందుకెళ్ళి నిలబడింది. రేగిపోయిన ముంగురులను కొనగోళ్ళతో దువ్వుకుంటూ అద్దంలో తన అందాన్ని చూచుకుని మురిసిపోయింది.

ఇంతలో గోడగడియారం ఏదో పాశ్చాత్య సంగీతంలా టింగు టింగుమని గంటలు కొట్టటం మొదలుపెట్టింది. తులసి కంగారుగా గదంతా కలయజూచింది. గోడ గడియారాన్ని చూచింది కాని, అందులోనుంచే ఆ శబ్దం వస్తున్నట్టు గ్రహించలేకపోయింది. ఆ గడియారంలో రెండు పక్షి బొమ్మలు ముచ్చట్లాడుకుంటున్నట్టుగా ముందుకు వెనక్కూ ఊగుతుండడాన్ని తులసి ఎంతో వింతగా పరికించింది. ఆ గది గోడలకు పెద్దపులుల తలలు, జింక తలలు, రకరకాల జంతు చర్మాలు, కత్తులు, కటార్లు, పెద్దపెద్ద తైలవర్ణ చిత్రాలు వున్నాయి. గది పైనుంచి రంగురంగుల గాజుబుడ్ల గుత్తులు వ్రేలాడుతున్నాయి. గదిలో ఒక మూల చక్కని లతలతో, బొమ్మలతో నగిషీ చేయబడిన నల్లజాజి డ్రాయరువుంది. దానిమీద రకరకాల అలంకరణ సామానులు ఉన్నాయి. గది నాల్గుమూలలా స్టాండుల్లో అమర్చబడివున్న వెండి పూలతొట్లు ఉన్నాయి. వాటిలో అప్పుడే కోసి తెచ్చి పెట్టినట్టుగా భ్రమకల్పించే కాగితపు పూలున్నాయి. నీలపు అద్దాలతో తయారుచేయబడిన కిటికీ దగ్గరగా ఒక పాన్పువుంది. ఒక నెమలిబొమ్మలాగా ఆ పాన్పు ఏర్పాటు చేయబడింది. ఆ పాన్పు చుట్టూ సిల్కు తెరలు వ్రేలాడుతున్నాయి.

ఆ గదిని, గదిలోవున్న వింత వింత వస్తువుల్ని చూచేసరికి తులసికి మతిపోయినంత పనయింది. తను ఎక్కడ వున్నానా అనిపించింది. ఇది కలకాదు కదా! ఇలాంటి గదిలో ఉండేవాళ్ళు మనుషులేనా! లేక స్వర్గలోకంలో ఉండే దేవతలా! అబ్బ! వీళ్ళు యెంతగొప్పవాళ్ళో! ఈగది చూడటానికే యింత అందంగా ఉంది. ఇందులో ఉండే మనుషులు ఇంకా యెంత అందంగా ఉంటారో! ఈ ఇంటి ఖామందులు యెంత గొప్ప ధనవంతులో! ఇంత గొప్పవాళ్ళింట్లో పని చేయడానికి నిజంగా తన మల్లన్న మావ ఎంతపున్నెం చేసుకున్నాడో! ఆడిని కట్టుకున్న తాను నిజంగా అదృష్టవంతురాలే! పోయిన ఏడు తన అయ్యావాళ్ళతో సినిమా చూడ్డానికి బస్తీకెళ్ళింది. ఆ సినిమాలో రాజులు, రాణులుండే గదులు, వాళ్ళ ఇళ్ళు అన్నీ యిలాగే ఉన్నాయి. సినిమాలో చూపించే ఆ మనుషులు, ఆ ధవంతులూ ఏవూళ్ళో ఉంటాయే అని మాణిక్యాన్ని అడిగితే అది నవ్వి - "ఓసి, ఎర్రిమొగమా! సినిమాలో వూరికే అట్టా సూపిత్తారే. నిజంగావుండవు-" అంది. అప్పట్లో నిజమే ననుకుంది. ఇప్పుడు ఈగదీ, ఈవస్తువులూ, ఇదంతా చూస్తూంటే మాణిక్యం అబద్దాలు చెప్పిందేమో ననిపిస్తోంది. ఈ ఇంటివాళ్ళుకూడా

కృష్ణమాచార్య



మాతృదేవతకు నిర్వచనం: అయిదుగురు మనుషులలో నలుగురికి సరిపడే అన్నంమాత్రమే వుండడం చూసి, తనకి బొత్తిగా ఆకలిలేదని అబద్ధమాడేది.

సినిమావాళ్ళేనేమో. మరయితే వీళ్ళుకూడా పాటలు పాడుతూ ఆకాశంలో యెగురుతారేమో....

తులసి ఇలా అనుకుంటూ ఆ పాన్పు సిల్కు తెరలు తొలగించి లోపలికి తొంగి చూచింది. దానిమీద వెన్నెలలాంటి తెల్లటి దుప్పటి పరచివుంది. మఖమల్ తలగడలు చక్కగా అమర్చబడివున్నాయి. ఆ తలగడలనుంచో, ఆ దుప్పటినుంచో సువాసనలు గుప్పుమంటున్నాయి. తులసికి ఆ పరుపు ముట్టుకుని చూడాలనిపించింది. మళ్ళీ భయమేసింది, ఎవరన్నా చూస్తారేమోనని. భయం భయంగా నలువంకలా చూచి, చివరకు ఎలాగో ధైర్యం చేసి ఆ పరుపుమీద చేయి వేసింది — మల్లెపూల తట్టలో చెయ్యి పెట్టినట్టనిపించింది. పాలకుండలో చేయి ముంచినట్టనిపించింది. కిటికీలోనుంచి వీచే చల్లనిగాలికి సిల్కు తెరలు కదిలి తులసి చెంపలకు రాసుకున్నాయి. తులసికి చక్కిలిగింతలు పెట్టినట్టనిపించింది. ఆ సిల్కు తెరలను చేతులతో పట్టుకుని చెంపలకు ఆనించుకుని, ఆ పాన్పువంక ఆ మఖమల్ తలగడల వంక చూస్తుంటే - తులసి గుండెల్లోంచి ఒక కోరిక చిన్నగా, సన్నగా కదులాడింది. మళ్ళీ వెంటనే తనమనస్సులో అనుకున్నదాన్ని యెవరన్నా విన్నారేమో ననిపించింది. భయపడింది .... సిగ్గుపడిపోయింది. 'ఖామందులు పడుకునే పక్క' అని మనసులో అనుకుని, చెంపలు వాయించుకుని, ఆ పాన్పును కళ్ళకద్దుకుని దణ్ణం పెట్టుకుంది.

తోటలోంచి మల్లన్న "తులశా!" అని పిలుస్తున్నాడు. ఆ పిలుపు విని తులసి వెనక్కు తిరిగింది. ఆ పాన్పు కాళ్ళ కట్టవయిపు గోడదగ్గరగా నిలబెట్టబడివున్న ఒక నగ్నసుందరి పాలరాతి విగ్రహం తులసి కళ్ళబడింది. అప్పటివరకూ తులసి ఆ విగ్రహాన్ని చూడనే లేదు. నగ్నంగావున్న ఆ విగ్రహాన్ని చూడగానే తులసి సిగ్గుల బొమ్మయిపోయింది. చేతులతో కళ్ళుమూసుకుంది. చేతివ్రేళ్ళ సందులనుంచి ఆ విగ్రహం కన్పిస్తూంది. ఆ నగ్నసుందరి నవ్వుతూ తనవంకే చూస్తున్నట్టనిపించింది.

"ఓ తులశా!" అని మల్లన్న పొలికేకలు పెట్టుతున్నాడు. అక్కడ ఒక సోఫా మీదున్న సిల్కు గుడ్డను ఆ నగ్నసుందరి మీద కప్పి తులసి బయటకు వచ్చింది.

ఆ గది తలుపులను చేరగిల వేస్తుంటే "ఇందాకట్నించి పొలికేకలు పెడుతుంటే పలకవేమే? ఇంకా వూడవటంగాలా?" అంటూ మల్లన్న వచ్చాడు.

తులసి "ఆ గది విచిత్తరంగా వుంటే సూత్తున్నా" అని ఆ గదివంక చూపించింది.

"అన్నీ విచిత్రంగానే ఉంటాయికానీ, పా, పా! పూల మొక్కలకు నీళ్ళు పొయ్యాలి" అంటూ బయటకు దారితీశాడు. వెనకాలే తులసి నడిచింది.

● ● ●

ఆ భవనం పట్నానికి పదహారుమైళ్ళ దూరానఉంది. పట్నంలోవుండే ఒక ధనవంతుల కుటుంబం. వారు ఆ భవనాన్ని నిర్మించారు. ఆ భవనానికి చుట్టుప్రక్కలా ఎటుచూచినా అడవులూ, కొండలూ, గుట్టలూ ప్రశాంతిలో మునిగివుంటాయి. ఆ ధనవంతుల కుటుంబం యజమానికి ఒకసారి పెద్ద జబ్బుచేసింది. డాక్టర్లు పట్నం వాతావరణంలో కాకుండా ప్రశాంతంగా వుండేచోట కొన్నాళ్ళపాటు ఉండాలన్నారు. అప్పుడు వూరికి దూరంగా ప్రశాంతంగా వుంటుందని ఆ భవనాన్ని అధునాతనంగా, సకల సౌకర్యాలతో నిర్మించారు. ఆయన ఆ భవనంలోకి మకాంమార్చిన కొద్ది రోజులకే స్వర్గస్థుడయ్యాడు. ఆ తర్వాత ఆయన కుమారులు దానిని తమ విలాసమందిరంగా మార్చుకున్నారు.

రోగగ్రస్తుడయిన ఆ కుటుంబ యజమానికి సపర్యలుచేయడానికి ఆయన ముసలి నౌకరు (మల్లన్న తండ్రి) కూడా వచ్చాడు. యజమాని పోయినతర్వాత మల్లన్న తండ్రి అక్కడే వుండిపోయాడు. ఆ భవనం వెనకాలఉన్న గుడిశెలో ఉంటూ ఆ భవనానికి కాపలాదారుడుగా వుంటూవచ్చాడు. నెలకూ, రెండు నెలలకూ ఒకసారి ఆ కుటుంబంలోవాళ్ళు ఎవరో ఒకరు కార్లో వచ్చి నాలుగైదు రోజులుండి పోతుంటారు. ఒకొక్కప్పుడు ఎక్కువరోజులు మకాం వేస్తారు. అప్పుడు తమవెంట వంటవాళ్ళను కూడా తీసుకుని వస్తుంటారు. తండ్రి చనిపోయిన తర్వాత మల్లన్న ఆ భవనానికి ఆ భవనానికి కాపలాదారు డయ్యాడు. ఆ భవనాన్ని జాగ్రత్తగా కాపలాకాస్తూ, భవనం చుట్టూ ఉన్న పూలమొక్కలకు నీళ్ళు పొయ్యడం, పావురాళ్ళనూ, కోళ్ళనూ పెంచుతుండటం, ఎవరయినా యజమానులూ, వాళ్ళతరఫువాళ్ళు వచ్చినపుడు వాళ్ళకు అన్ని సదుపాయాలూ చేయటం–ఇదీ మల్లన్న పని.

మల్లన్న మొదటిభార్య గర్భంధరించి ప్రసవించేవేళ చనిపోయింది. ఆ తర్వాత తులసిని రెండోపెళ్ళి చేసుకున్నాడు. తులసి రెండురోజుల క్రితమే మల్లన్న ఇంటికి కొత్తగా కాపరానికి వచ్చింది. తులసి వయస్సులో మల్లన్నకంటే చాలా చిన్నది. ఎక్కడో కుగ్రామంలో పుట్టి పెరగడంవల్ల కాస్త అమాయకంగా ఉంటుంది. కాని, పనిపాటలుమాత్రం చక్కగా చేస్తుంది. అందచందాల్లోనూ ఏం తక్కువగా ఉండదు. పుత్తడిబొమ్మలాగా ఉంటుంది. అందుకనే మల్లన్న తనకు పనిపాటల్లో సహాయంగా ఉంటుందని తులసి తండ్రికి రెండువందలిచ్చి తులసిని పెళ్ళిచేసుకుని తన గుడిశెకు తెచ్చుకున్నాడు. నిన్నటిరోజంతా తులసికి తన గుడిశెను సవరించుకోవటంతోనే సరిపోయింది. ఇవ్వాళ బంగళా పూదవటానికి వచ్చింది.

● ● ●

ఆరాత్రి తులసి తిండి తిని కుక్కినులక మంచంలో పాతబొంత వేసుకుని పడుకుంది. పడుకుందన్న మాటేగానీ నిద్దర పట్టలేదు. కన్నుమూసినా, తెరచినా బంగళాలోని పడగ్గది, సిల్కుతెరలపాన్పు, నిలువుటద్దం, పాలరాతి విగ్రహం - ఇవే కళ్ళముందు మెదులుతున్నాయి. తాను పడుకున్న కుక్కిమంచం కదిలినప్పుడల్లా కిర్రు, కిర్రుమంటూ తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది. ఈ పాడు మంచం తన ప్రాణానికి యెక్కడ దాపురించిందా అని మనస్సులో తిట్టుకుంది.

మొదట్లో మావ తన్ను రెండు మూడు రోజులకోసారి బంగాళాలో గదులు చిమ్మమన్నాడు. కాని, యిప్పుడు తాను రోజూ రెండుపూటలా చిమ్ముతున్నది. ఏదో ఒక పని కల్పించుకుని ఆ గదిలోకివెళ్ళి ఒక్కసారి ఆ పాన్పునూ, పాలరాతి విగ్రహాన్నీ, నిలువుటద్దాన్నీ చూచి వస్తుంది. రాను, రాను తులసి బంగళాలోని పడగ్గదినీ, సిల్కుతెరల పాన్పునూ మరచిపోలేకపోతున్నది. ఏపని చేస్తున్నా అవే కళ్ళముందు కదులాడుతున్నాయి తన గుడిశెలోని కుక్కిమంచాన్ని చూడగానే దాన్ని యెక్కడికక్కడ విరిచి పొయ్యిలో పెట్టబుద్ధేస్తుంది. బంగళాలోని గది గుర్తుకు రాగానే తులసి గుండెల్లో గులాబీలు పూస్తాయి.

ఎందుకనో తులసి రెండు మూడురోజులుగా మల్లన్నమీద వుండివుండి విసుక్కుంటున్నది. మళ్ళీ కాసేపట్లో అతడిని అంతులేని అనురాగంలో ముంచి లేవనెత్తుతుంది. అతడిని ఆటలు పట్టిస్తుంది. ఇదివరకు తులసి గుండెల్లో సన్నగా, జాలుగా, రేఖగా మెదిలే కోర్కె యీమధ్యలో తుగా, ముంపుగా, ముమ్మరంగా వూగించి పారేస్తున్నది తులసిని. తనలో యింతగా తావుచేసుకున్న ఆ కోర్కెను మల్లన్నకు మాటల ద్వారా చెప్పడానికి జంకుతున్నది. తన కోర్కెవిని మన్నిస్తాడో లేదో! ఆఖరికి ఓరాత్రి ధైర్యం చేసింది - ఆరుబయట, వెన్నెట్లో ఆ కుక్కి మంచంమీద - తన సౌందర్యారాధనలో మైమఱచిన మల్లన్న మావ చెవిలో మెల్లిగా ఊదింది - 'బాబుగోరి బంగళాలో పడగ్గదిలో అవక్క ...' అబ్బ, ఎంత బావుందో! దానిమీద.... మరే ...పడుకోవాలనిపిస్తుంది' - అని.

అంతే! వినకూడని మాట విన్నట్లు మల్లన్న ఉలిక్కిపడ్డాడు. ఠివాల్న లేచి నుంచున్నాడు. కోపంగా 'ఈకూత మళ్ళా కూశావంటే మక్కెలు విరగబొడిసేత్తా! కోరక, కోరక భలే కోరావు లే. ఇదా యిసయం, ఆగదిమీద ఓమోజుసూపిత్తూంటే ఏటో ననుకున్నా.' అని పైపంచ కసిగా దులిపి భుజానేసుకుని బయటికెళ్లాడు.

బయటకెళ్ళిన మల్లన్న ఓ గంటసేపు అక్కడా అక్కడా తిరిగి గుడిశెకువచ్చాడు. మంచంమీద తులసిలేదు. ఆ కుక్కినులక మంచం, పాత బొంతా మల్లన్నను వెక్కిరించాయి. కంగారుగా మల్లన్న గుడిశెలోకి తొంగి చూచాడు. ఓమూల పడుకుని తులసి వెక్కివెక్కి ఏడుస్తూంది. మెల్లగా దగ్గరకెళ్ళి 'తులశే' అన్నాడు. అతడి గొంతు వినగానే తులసి ఏడుపు యింకా యెక్కువయింది. చేతుల్లోకి తీసుకుంటానికి ప్రయత్నించాడు. ఉహూ....పాముపిల్లలాగా, పొగలాగా, అలలాగా, కలలాగా జారిపోయింది.

"పిచ్చిదానా! మనం అలాంటి పని సేయకూడదే" అన్నాడు.

"ఒక్కసారంటే ఒక్కసారి కేమవు తుందేవిటీ? నామీద నీకు మనసులేదని చెప్పరాదు." అంది.

—తులసి కన్నీటి వాగయింది. ఉద్వే గాల ఉరవడిలో రెల్లుపొల్లయింది.

"సర్లే వే, రేపు సూద్దాంగా....ఆ.... సరేనా" అంటూ మళ్లా చేతుల్లోనికి తీసుకుం టానికి ప్రయత్నించాడు. ఈసారి తులసి వుడుంలాగా అతుక్కుపోయింది మల్లన్నకు. వెన్నెలలాగా అలుముకుంది. నిప్పురవ్వలాగా చురుక్కుమంది - మల్లన్న చేతి బాణాకర్ర చివరకట్టిన మువ్వలాగా నవ్వింది గుండెల మీద....

మర్నాడల్లా తులసి ఆనందానికి అవధులు లేవు. పనులన్నీ చకచకా చేసుకుంది. మల్లన్న తన్ని పిల్చి బంగళా అంతా కడిగి ముగ్గులుపెట్టి వుంచమని చెప్పినప్పుడు. "ఓస్, నీవు నాకు చెప్పాలేం"టని ! చీర ఎగగట్టి, పమిటచెంగును నడుంచుట్టూ తిప్పి బొడ్లో దోపుకుని, చీపురుతీసుకుని రాంబాణం లాగా వెళ్ళింది బంగళావయిపు. ఆమె కా రోజల్లా బంగళానంతా కడగటం, ముగ్గులు పెట్టటం, ఎక్కడి వస్తువుల్ని అక్కడ సవరించటంతోనే సరిపోయింది.

సాయంత్రం నాల్గుగంట లయేసరికి కార్లో ఇంటి పెద్దకోడలమ్మగారు, పిల్లలతోను, కాలేజీలో చదువుకుంటున్న మరిదితోను దిగారు—తులసి గుండెల్లో రాయిపడ్డది. అందులోను వంటవాళ్ళతో సహా దిగారు. అంటే చాలారోజులే ఉంటారన్నమాట. తులసికి ఏడుపువచ్చినంత పనయింది. వచ్చే సిందికూడా. మొగం ముడుచుకుని గుడిశెలో ఓ మూల కూర్చుంది. మల్లన్న మాటిమాటికీ బంగళాలోకి గుడిశెలోకి హడావుడిగా తిరుగుతూ అలిగికూచున్న తులసినిచూచినవ్వుతూ "ఏం, పిల్లా! ఇంకా అట్టా కూసున్నావే. పొద్దుకూకుతుంది. సోకు సేసుకోమరి." అనే సరికి తులసి వుడికిపోయింది కోపంతో. వుక్రోషంతో మొగం కందగడ్డయింది. ఆ రాత్రి మల్లన్న దగ్గరకుపిలిచినా రాకుండా గుడిశెలో ఓ మూల ములగదీసుకుని పడుకుంది.

ఒకరాత్రికాడ మల్లన్న తులసిని- "లేవే". అంటూ తట్టి లేపాడు. తులసి విసుక్కుంటూ లేచి కూర్చుని, ఆవులిస్తూ "ఎందుకు లేపావు" అని అడిగింది.

"రా, నీకొక గమ్మత్తు సూపిత్తా" నంటూ కిటికీదగ్గరకు తీసికెళ్ళి బంగళావయిపు చూపించాడు.

బంగళా అక్కడకు పదిబారల దూరంలో వుంది. ఎదురుగుండా పడగ్గది కిటికీ కన్పిస్తున్నది. గదిలోపల లైటు వెలుగుతూంది. కిటికీ దగ్గరగా రెండు ఆకారాలు ప్రక్క ప్రక్కన నిలబడివున్నాయి. ఒక ఆకారంలో మరొక ఆకారం కలిసిపోతున్నట్లుంది. కరగిపోతున్నట్లుంది.

తులసి పక్కకుజరిగి మల్లన్నను గట్టిగా వాటేసుకుంది. భయంతో తులసి గుండె దడదడలాడింది. మల్లన్నను బల్లిలాగా కరచుకుని మెల్లిగా "అదేటి మావ, ఆ ళ్ళిద్దరూ పెదకోడలమ్మగారు, బుల్లిబాబు గోరు కదూ" అని అడిగింది.

మల్లన్న నవ్వుతూ తులసి వీపుమీద గోముగా రాస్తూ 'అళ్ళేమరి' అన్నాడు. ఒక నీచాతి నీచ కార్యాన్ని కళ్ళతో చూచినప్పుడు, చెవులతో విన్నప్పుడు కలిగే జుగుప్సాభావం తులసి నిలువెల్లా ప్రాకింది.

'అటుసూడు' అని మల్లన్న మళ్ళీ ఒక దృశ్యాన్ని చూపించాడు. ప్రపంచంలోని పాపమంతా ఒకచోట చేరుకుని, పేరుకుని ముద్దకట్టినట్టుగా లీనమయిపోయిన ఆ రెండు ఆకారాలు మెల్లగా సిల్కుతెరల పాన్పువైపు నడిచాయి. తులసికి ముచ్చెమట్లు పోశాయి. కాళ్ళలోని సత్తువంతా కరగి చెమటగా కారిపోయింది. నిలవలేక మల్లన్న మీదకు వరిగిపోయింది.

● ● ●

'నీకు తెల్దుగాని తులశా - నేను నాచిన్నతనంనుంచీ ఈ కళ్ళతో ఈ బవంతిలో, ఆగదిలో జరిగిన గోరాలెన్నో సూశా. ఇప్పుడు నిన్నమరిదితో కులుకుతున్న ఈ యమ్మ కారుడయిపరు సుందరంగాడితో వుండగా నా యీ కళ్ళతో సూశా. ఈబుల్లి బాబుగోరి తరువాతావిడ, ఇప్పుడంటే పెళ్ళయి అత్తారింటికెళ్ళింది గానీ, కాలేజీలో సదివేటప్పుడు పెతి ఆదారం కార్లోవచ్చి ఆ సుందరంగాడితో ఆగదిలో గంటా, రెండు గంటలుండిపోయేది. ఇక పెదబాబుగోరి సంగతి సరేసరి. ఒకమారి తెచ్చిన ఆడ మడిసిని ఇంకోమారి తెచ్చేవాడు కాడు. ఆళ్ళల్లో అసలయిన పెదకోడలమ్మ ఎవరో నాకు నిన్నమొన్నటిదాకా తెల్దంటే నమ్ము. ఒకసారి ఏవయిందంటే - పెదబాబుగోరు ఎవతెనో తీసుకొచ్చారు కార్లో. సూత్తానికి బంగారం నిలకలావుంది - పెళ్ళికూడా అయిందట్టుంది. మరి తిన్నగా కాపరం సేస్కోక, మరాతల్లికి ఏం పాడుబుద్దో ఈయనగోరితో వచ్చేసింది - ఆళ్ళిద్దఱు ఆ గదిలో దూరారో లేదో - ఇంకొకాయన వచ్చిండు. మనిసి మాంచి దిట్టమైనోడులే. తుపాకి తీసుకుని మరీ వొచ్చిండు. మిలిట్రీ దొరంట - వచ్చేసి పెదబాబుగోర్ని కాల్చేత్తానని నానాహంగామా సేశాడు. ఆళ్ళిద్దఱూ కుక్కల్లాగా కొట్లాడుకున్నారు. మళ్లా ఆ మాతల్లి ఏదీ యెరగనిదానికిమల్లే, ఏదీ జరగనట్టే మిలట్రీదొరగారమ్మతో కార్లో ఉడాయించింది. పెదబాబుగోర్ని సితకతన్నాడులే. అయినా ఆ ఎదవపన్లుమానలేదు బాబుగోరు. ఆళ్ళిద్దఱూ అప్పుడప్పుడూ వొస్తూనే వుండారు యిక్కడికి'—

మల్లన్నను కరచుకుని అతని డొక్కల్లో మునగదీసుకుని పడుకున్న తులసి "ఇక సాల్లే ఆపుమావా. పాడుమాటలు. వింటుంటేనే వళ్లు సిటపటలాడిపోతుంది" అంది.

మల్లన్న నవ్వుతూ "మరి నే సెబితే విన్నా? ఓయబ్బ ఆ మంచమెక్క కుల కాలని కూసున్నావు. ఆ మంచమ్మీన అన్నన్ని గోరాలు జరిగాయి. దాన్ని సూత్తేనే నాకు వళ్ళుమంట!" అన్నాడు.

అంతే, మళ్ళీ జన్మలో తులసి ఆ సిల్కుతెరల పాన్పుమాట ఎత్తలేదు. ఆ గదిలోకి వెళ్ళటానికే అసహ్యించుకుంటుంది. ఎప్పుడన్నా ఆ గది చిమ్మటానికి లోపలికెళ్ళితే, ఆ పాన్పునుచూచి కాండ్రించి ఉమ్మేసి, పెళపెళమని మెటికెలువిరిచి, దాన్ని అడ్డమయిన తిట్లు తిట్టికానీ మరీ బయటకురాదు. సిల్కుతెరల పాన్పుఅంటే తులసికి అంత రోత! తన కుక్కిమలకమంచం ఇప్పుడామెకొక పూలతెప్ప; హంసతూలికా తల్పం! దాన్ని ఎంతో అపురూపంగా చూచుకుంటుంది. □□□